సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

మంగళవారం । 31 । అక్టోబర్ । 2023

I



నిత్యాన్నదాన పథకానికి రూ.1,01,116 విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి పి.సుజాత (సికింద్రాబాద్) రూ.1,01,116 విరాళం సోమవారం ఆలయ అర్చకులకు అందజేశారు.




ఊరు వెళ్లి వచ్చేసరికి ఇల్లు గుల్ల

ఊరు వెళ్లి వచ్చే సరికి దొంగలు ఇల్లు గుల్ల చేశారు. కూనవరం గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంటి తలుపులు పగులగొట్టి దొంగలు 13 కాసుల బంగారం, పావు కేజీ వెండి, 33 వేల నగదు చోరీ చేశారు.

II లో

కాలువలకు నీరు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం తూర్పు డెల్టాకు 3,500, మధ్య డెల్టాకు 2,600, పశ్చిమ డెల్టాకు 7,200 క్యూసెక్కుల నీటిని వదిలారు.



న్యూస్‌రీల్

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించే ప్రాంతాలు

అల్లవరం: అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని వివిధ మండలాల్లోని గ్రామాల్లో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు జరిగే ప్రాంతాల వివరాలను డీఎంఅండ్‌హెచ్‌ఓ దుర్గారావు దొర సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నల్లమిల్లి సచివాలయం (అమలాపురం రూరల్ మండలం), పెదమడి ఎంపీపీ స్కూల్ (ఐ.పోలవరం), ఏనుగుమహల్, కొత్తపేట-5 (కొత్తపేట), నరేంద్రపురం-2 సచివాలయం (పి.గన్నవరం), అల్లవరం-1 ఎంపీపీ పాఠశాల (అల్లవరం), కత్తిమండ ఎంపీపీ స్కూల్ (మల్కిపురం), దేవరపల్లి -1 గ్రామ సచివాలయం (రావులపాలెం) చింతలపల్లి-2 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (రాజోలు), అప్పర్ ప్రైమరీ హెల్త్ సెంటర్, కచేరీ చావిడి, సీహెచ్ ఎస్ కాలనీ (అమలాపురం టౌన్), బొండాయి కోడు తూము, మున్సిపల్ ఆఫీస్ (ముమ్మిడివరం మండలం) ప్రాంతాల్లో సురక్ష శిబిరాలు నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు.

2 నుంచి వాడపల్లి వెంకన్న బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు వచ్చే నెల 2 నుంచి వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. ఆ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. సోమవారం ఆలయంలో స్వామివారికి ఆలయ అర్చకులు తిరుమంజన సేవ నిర్వహించారు. వచ్చే నెల 2 నుంచి 10 వరకు 9 రోజుల పాటు తొమ్మిది వాహనాలపై స్వామివారి ఊరేగింపులు, చతుర్వేద పండితుల ఆధ్వర్యంలో విశేష కైంకర్యాలు, అశేషంగా తరలివచ్చే భక్తులతో వాడపల్లి బ్రహ్మోత్సవం సాగుతుందన్నారు. బ్రహ్మోత్సవ కార్యక్రమాలు వైఖానస ఆగమోక్తంగా పండితుల పర్యవేక్షణలో నిర్వహిస్తామన్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలివస్తారన్నారు. దర్శనాలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక క్యూ లు ఏర్పాటు చేశామన్నారు. రెండవ తేదీ ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, ఋత్విక్ వరుణ, దీక్షాధారణ, అగ్ని ప్రతిష్ఠాపన, అకల్మష హోమం, దిగ్దేవత ప్రార్థన, విశేషార్చన, నీరాజనం, సాయంత్రం వాస్తు హోమం, ధ్వజపతాక హోమాలు, నవమూర్తి ఆవాహన, భేరీపూజ, ధ్వజారోహణ, బలిహరణ, నీరాజనం, అనంతరం పరావాసుదేవ అలంకరణలో శేషవాహన సేవ తదితర కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు.

బియ్యం భోక్తల పై విజిలెన్స్

- దర్జాగా చౌక బియ్యం అక్రమ తరలింపు
- ఉమ్మడి 'తూర్పు'లో యథేచ్ఛగా దందా
- అక్రమార్కులపై అధికారుల ఉక్కుపాదం
- ఎప్పటికప్పుడు సరకు సీజ్.. కేసుల బనాయింపు
- 7నెలల్లో 2,005 క్వింటాళ్లు స్వాధీనం

ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు వివరాలు

స్వాధీనం చేసుకున్న బియ్యం	2,005 క్వింటాళ్లు
బియ్యం విలువ	రూ. 47,97,560
స్వాధీనం చేసుకున్న వాహనాలు	34
వ్యక్తుల అరెస్టు	99 మంది

గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది జనవరి వరకు

స్వాధీనం చేసుకున్న సరకు విలువ	రూ.10.41 కోట్లు
6ఏ-కేసుల నమోదు	35
క్రిమినల్ కేసులు	35
అక్రమ రవాణాలో పాల్గొన్నవారు	119

సాక్షి, రాజమహేంద్రవరం: బియ్యం అక్రమ రవాణాపై విజిలెన్స్ ఉక్కుపాదం మోపుతోంది. సరిహద్దు, సాధారణ ప్రాంతాల్లో నిఘా కట్టుదిట్టం చేస్తోంది. అధికారుల కళ్లుగప్పి తరలిస్తున్న సమాచారం అందుకుని దాడులు విస్తృతం చేస్తోంది. పట్టుబడిన లారీలు, బియ్యం బస్తాలను సీజ్ చేస్తోంది. అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తులపై కఠినంగా వ్యవహరిస్తోంది. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా వారిపై క్రిమినల్ కేసులు సైతం బనాయిస్తోంది.

ఉమ్మడి తూర్పులో ఇలా..

ఉమ్మడి తూర్పుగోదావరి (కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి) జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు ఏడు మాసాల వ్యవధిలో 2005 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నారు. రూ.47,97,560 విలువైన సరకు సీజ్ చేశారంటే బియ్యం ఏస్థాయిలో పక్కదారి పడుతోందో అర్థం అవుతోంది. అక్రమ రవాణాకు వినియోగించిన 34 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. 99 మందిని అరెస్టు చేసినట్లు విజిలెన్స్ అధికారుల గణాంకాలు స్పష్టం చేస్తున్నారు.

2022 ఏప్రిల్ నుంచి 2023 జనవరి వరకు..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది జనవరి వరకు ఏకంగా రూ.10.41 కోట్ల విలువ చేసే సరకు సీజ్ చేశారు. ఇందులో పీడీఎస్ బియ్యం 7017.80 క్వింటాళ్లు, ధాన్యం . 16612.33 క్వింటాళ్లు, విరిగిన బియ్యం 274.5, రంగు మారిన బియ్యం 198.5, సాధారణ బియ్యం 8422.73 క్వింటాళ్లు ఉన్నాయి. అంగన్‌వాడీ, పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి సరఫరా చేసే ఫోర్టిఫైడ్ రైస్ 186 క్వింటాళ్లు స్వాధీనం చేసుకున్నారు. బియ్యం ఊక 51.75, సన్నబియ్యం 39 క్వింటాళ్లు పట్టుకున్నారు. బియ్యం రవాణాకు బిల్లులున్నా ప్రభుత్వానికి పన్ను చెల్లించకుండా మరికొందరు తరలిస్తున్నట్లు తేలింది. వీటన్నింటిపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఎసెన్షియల్ కమాడిటీస్ యాక్ట్ 1955 కింద 6-ఏ కేసులు 35 నమోదు చేశారు. మరో 35 మందిపై క్రిమినల్ కేసులు పెట్టారు. ఇందులో 119 మంది పాల్గొనట్లు నిర్ధారించారు.



తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు గామన్ బ్రిడ్జిపై పట్టుబడిన బియ్యం (ఫైల్)



కాకినాడ జిల్లా రౌతులపూడిలో స్వాధీనం చేసుకున్న బియ్యం (ఫైల్)

దాడులు చేస్తున్నా ఆగని దందా

పేదలకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బియ్యాన్ని రూ.7 నుంచి రూ.10 చొప్పున మాఫియా సేకరిస్తోంది. వాటిని నూకలు, పిండిగా మార్చి పౌల్ట్రీ సంస్థలకు రూ.18 నుంచి రూ.25కు విక్రయిస్తోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పౌల్ట్రీ పరిశ్రమలు అధికంగా ఉండటంతో క్వింటాళ్ల కొద్దీ బియ్యం ఇక్కడకు దిగుమతి అవుతోంది. ఇళ్ల నుంచి బియ్యం కొనుగోలు చేసే చిరువ్యాపారులు, కొందరు డీలర్ల నుంచి కొనుగోలు చేస్తున్న అక్రమార్కులు పొరుగు రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణలకు ఎగుమతి చేస్తూ రూ.కోట్లు ఆర్జిస్తున్నట్లు సమాచారం. తూర్పుగోదావరి జిల్లా నాలుగు రాష్ట్రాలకు సరిహద్దులో ఉండటం, జల రవాణాకు అనుకూల వాతావరణం ఉండటంతో జిల్లా కేంద్రంగా దందా మూడు బస్తాలు.. ఆరు లారీల చందంగా సాగుతున్నట్లు ఆరోపణలున్నాయి. తెలంగాణ రాష్ట్ర సరిహద్దు జిల్లాలైన ఖమ్మం తదితర ప్రాంతాల నుంచి జిల్లాకు టన్నుల కొద్దీ బియ్యం రవాణా అవుతోంది. వివిధ మార్గాల ద్వారా సేకరించిన బియ్యాన్ని ముందుగా రహస్య స్థావరాల్లో ఉంచి అనంతరం అదునుచూసి గుట్టుచప్పుడు కాకుండా రవాణా చేస్తున్నారు. అక్రమార్కుల భరతం పట్టేందుకు సివిల్ సప్లయి, పోలీసులు, విజిలెన్స్ బృందాలు దాడులు చేస్తున్నా బెదిరేది లేదని రెచ్చిపోతున్నారు.





తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం ఈలకొలను వద్ద పట్టుబడిన బియ్యం లారీతో విజిలెన్స్ అధికారులు (అంతర చిత్రం) బియ్యం బస్తాలు


నూకలుగా మార్చి..!

ప్రభుత్వం పేదలకు అందిస్తున్న రేషన్ బియ్యం అక్రమ రవాణాలో మాఫియా కొత్త ఐడియాకు తెరతీసింది. కొంతమంది లబ్ధిదారులు ప్రభుత్వం ఇస్తున్న బియ్యం తినేందుకు ఇష్టపడకపోవడం, మరి కొందరికి ఇంట్లో బియ్యం నిల్వలు ఎక్కువగా ఉన్న కారణాలతో చిరు వ్యాపారులు, రేషన్ డీలర్లకు విక్రయిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో రేషన్ డీలర్లే కార్డుదారుల నుంచి కిలోకు రూ.10 చొప్పున చెల్లించి ఈ పాస్ మెషీన్‌లో వేలిముద్ర వేయించుకుని పంపుతున్నారు. ఆ బియ్యం తమ దుకాణాల్లో నిల్వ ఉంచుతున్నారు. వాటిని వేరే సంచుల్లోకి మార్చి ఏమార్చుతున్నారు. ఆటోలు, మినీ వ్యాన్లు, లారీల ద్వారా ఎవరికీ దొరకని రహస్య ప్రాంతాలకు తరలిస్తున్నారు. అక్కడ నూకలుగా మార్చి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు సమాచారం.

మచ్చుకు కొన్ని పరిశీలిస్తే..

- గుంటూరు నుంచి కాకినాడ పోర్ట్‌కు 30 టన్నుల పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా చేపడుతుండగా కొవ్వూరు చెక్‌పోస్ట్ వద్ద అధికారులు నిర్వహించిన దాడుల్లో పట్టుబడ్డాయి. ఈ ఘటనలో బియ్యం తరలిస్తున్న వ్యక్తులు, వాహనాన్ని సీజ్ చేశారు.
- తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు గామన్ బ్రిడ్జి వద్ద ఉన్న టోల్ ప్లాజా వద్ద సాయంత్రం 4 గంటల సమయంలో 20 టన్నుల పీడీఎస్ బియ్యం, ఒక లారీని అధికారులు సీజ్ చేశారు.
- కోనసీమ జిల్లా ఆలమూరు-జొన్నాడ రోడ్డులోని ఎస్ మలుపు వద్ద లారీలో అక్రమంగా 566 బస్తాల్లో తరలిస్తున్న 27,000 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని రాజమహేంద్రవరం రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు.
- కాకినాడ జిల్లా గండేపల్లి వద్ద ఉన్న ఓ రైస్ మిల్లులో పీడీఎస్ బియ్యాన్ని పాలిష్ చేసి ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు సమాచారం అందటంతో విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. దాడుల్లో మిల్లులో నిల్వ ఉంచిన 111.565 మెట్రిక్ టన్నుల రూ.43,15,470 విలువ చేసే పీడీఎస్ బియ్యాన్ని, రెండు మినీ వ్యాన్లను అధికారులు సీజ్ చేశారు.

పటిష్ట నిఘా



బియ్యం అక్రమ రవాణాపై నిఘా కట్టుదిట్టం చేశాం. సమాచారం అందగానే బృందంతో రంగంలోకి దింగుతున్నాం. బియ్యం ఎక్కడెక్కడికి రవాణా చేస్తున్నారన్న విషయమై ఆరా తీస్తున్నాం. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచాం. అక్రమ రవాణా చేస్తున్న వాహనాలపై దాడులు చేస్తున్నాం. పట్టుబడిన సరకును సీజ్ చేస్తున్నాం. ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా క్రిమినల్ కేసులు సైతం బనాయిస్తున్నాం. ఉచిత బియ్యాన్ని కొనుగోలు చేయడం, విక్రయించడం చట్టరీత్యా నేరం. ఇలాంటి వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కేసులు బనాయిస్తాం.

–కరణం కుమార్, ఎస్పీ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్

రక్తదానం చేసి ప్రాణదాతలవ్వండి

ఎస్పీ శ్రీధర్

అమలాపురం టౌన్: రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఎస్పీ సుసరాపు శ్రీధర్ అన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా అమలాపురంలోని గంగారాజు ఫంక్షన్ హాలులో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటైన మెగా రక్తదాన శిబిరాన్ని ఎస్పీ శ్రీధర్ ప్రారంభించి ప్రసంగించారు. అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్, సహృదయ ఫౌండేషన్ సంయుక్త సహకారంతో ఏర్పాటైన ఈ మెగా రక్తదాన శిబిరంలో పోలీసు అధికారులు, కార్మికులు, విద్యార్థులు మొత్తం 200 మందికి పైగా రక్తదానం చేశారు. ఎస్పీ శ్రీధర్, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా, అమలాపురం పట్టణ, రూరల్ సీఐలు టి.క్రాంతికుమార్, పి.వీరబాబు, అమలాపురం తాలూకా, ఉప్పలగుప్తం ఎస్సైలు ఎ.పరదేశి, జి.వెంకటేశ్వరరావు, ఎస్పీ కార్యాలయ ఆర్ఐ నరసింహమూర్తి, ఏఆర్ ఎస్సై ఉదయ్ తదితర పోలీసు సిబ్బంది రక్తదానం చేశారు. వీరితోపాటు ఆదిత్య, బీవీఎస్, ఎస్‌కేబీఆర్ కళాశాలల విద్యార్థులు, ఆటో డ్రైవర్లు రక్తదానం చేశారు. ఏరియా ఆస్పత్రి డాక్టర్ అన్నపూర్ణ, బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి దొడ్డా కాశి వారి నుంచి రక్తాన్ని సేకరించారు. సహృదయ ఫౌండేషన్ చైర్మన్ పైడి రాజేష్ శిబిరంలో సేవలు అందించారు. జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు డీఎస్పీ పి.విజయసారథి, అమలాపురం డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్, ఎస్పీ కార్యాలయం ఎస్బీ సీఐ రాజశేఖర్ పర్యవేక్షణలో శిబిరం సాగింది. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరినీ ఎస్పీ శ్రీధర్, ఏఎస్పీ బాషాలు అభినందించారు. చివరిగా విధి నిర్వహణలో అమరులైన పోలీసుల సేవలు, త్యాగాలను స్మరించుకున్నారు. వారికి ఘన నివాళులు అర్పిస్తూ జోహార్లు అర్పించారు.



రక్తదానం చేస్తున్న ఎస్పీ శ్రీధర్

గ్రామాల స్వచ్ఛత మనందరి బాధ్యత

మంత్రి చెల్లుబోయిన వేణు

కె.గంగవరం: ప్రజలు గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి జగనన్న స్వచ్ఛ సంకల్పానికి చేయూతనివ్వాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాలకృష్ణ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని కుందూరు గ్రామంలో సోమవారం స్వచ్ఛత మనందరి బాధ్యత కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సమావేశంలో మంత్రి చెల్లుబోయిన వేణు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ ఇళ్లల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను భద్రపరిచి పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. దీంతో పాటు కూరగాయల వ్యర్థాలు, ఇతర వ్యర్థాలను ఇంటి పెరట్లో గొయ్యి తీసి దాంట్లో వేయాలన్నారు. తద్వారా ఆ వ్యర్థాలు ఎరువులుగా మారతాయని వాటిని పంట పొలాలకు, ఇళ్లల్లో ఉండే మొక్కలకు వేయాలని సూచించారు. తద్వారా పారిశుధ్య కార్మికులకు పని భారం తగ్గుతుందని తెలిపారు. ఈ ప్రక్రియను మొదటిసారిగా కుందూరు గ్రామ వ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ విధంగా నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో స్వచ్ఛత మనందరి బాధ్యత కార్యక్రమం చేపడతామని తెలిపారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాల్లో డంపింగ్ యార్డులకు, శ్మశాన వాటికలకు స్థలాల కొరత ఉందని మంత్రి చెల్లుబోయిన వేణు ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం వల్ల స్థలం కొరత లేకుండా వ్యర్థాలను పాతిపెట్టడడే కాకుండా ఎరువులుగా కూడా ఉపయోగించవచ్చన్నారు. త్వరలో జిల్లావ్యాప్తంగా ఈ కార్యక్రమం నిర్వహించే ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. జిల్లా పంచాయతీ అధికారి కృష్ణకుమారి, ఎంపీపీ పంపన నాగమణి, సర్పంచ్ పంపన సత్యానందం, మార్కెట్ కమిటి చైర్మన్ పందు గోవిందరాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యులు బత్తుల అప్పారావు పాల్గొన్నారు.



కుందూరులో చెత్త వేయడానికి తీసిన గోతిని పరిశీలిస్తున్న మంత్రి వేణు, కలెక్టర్ శుక్లా

జగనన్నకు చెబుదాం అర్జీలకు సత్వర పరిష్కారం

అధికారులకు కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశం

అమలాపురం రూరల్: జగనన్నకు చెబుదాం పోర్టల్‌లో నమోదయ్యే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి అర్జీలకు నాణ్యతతో కూడిన సత్వర పరిష్కార మార్గాలు చూపాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో గోదావరి భవన్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందన-జగనన్నకు చెబుదాం కార్యక్రమం జరిగింది. కలెక్టర్ హిమాన్షు శుక్లా, జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబులతో కలిసి అర్జీలను స్వీకరించారు. 276 అర్జీలు వచ్చాయి. కలెక్టర్ ఆయన పరిధిలోని వాటికి తక్షణమే పరిష్కార మార్గం చూపగా మిగిలిన వాటిని పరిశీలించి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్పందన కార్యక్రమానికి ప్రత్యామ్నాయంగా జగనన్నకు చెబుదాం నిర్వహిస్తామని, జగనన్నకు చెబుదాం పోర్టల్ ద్వారా ముఖ్యమంత్రికి నేరుగా ఫిర్యాదులు వెళ్తున్నాయనే విషయాన్ని అధికారులు గుర్తించి గడువులోగా నాణ్యతతో కూడిన పరిష్కారాలు చూపాలని ఆదేశించారు. జగన్నకు చెబుదాం పోర్టల్‌ను ప్రతి రోజు, ప్రతి శాఖ అధికారులు విధిగా పరిశీలించాలన్నారు. ఒకసారి వచ్చిన అర్జీల పునరావృతం కాకుండా పరిష్కరించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎం. దుర్గారావు దొర, డీసీహెచ్‌ఎస్ పద్మశ్రీ రాణి, డీఆర్‌డీఏ పీడీ శివశంకర్ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్‌ఎస్ ఈ సీహెచ్ ఎన్వీ కృష్ణారెడ్డి, సీపీవో వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబు, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి జీవీ సత్యవాణి, జిల్లా పౌర సంరఫరాల అధికారి పాపారావు, మార్కెటింగ్ శాఖ ఏడీ కె.విశాలాక్షి, గ్రామ వార్డు సచివాలయల నోడల్ అధికారి భీమేశ్వర్, జిల్లా విద్యాశాఖ అధికారి కమలకుమారి, వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



స్పందనలో అర్జీలు తీసుకుంటున్న కలెక్టర్ శుక్లా

పోలీసు 'జగనన్నకు చెబుదాం'కు 29 అర్జీలు

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 29 అర్జీలు వచ్చాయి. ఎస్పీ సుసరాపు శ్రీధర్ నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా పలువురు అర్జీదారులు వచ్చి తమ సమస్యలను ఫిర్యాదుల రూపంలో విన్నవించుకున్నారు. జిల్లా ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా కూడా కొన్ని అర్జీలను అందుకుని పరిశీలించారు. అర్జీదారులు ఇచ్చిన ఫిర్యాదులకు సంబంధించి కొన్ని సమస్యలపై ఎస్పీ శ్రీధర్ స్పందించి అక్కడికక్కడే చర్యలు చేపట్టారు. ఆయా పోలీసు స్టేషన్ల అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి ఆదేశాలు ఇచ్చారు. కుటుంబ తగదాలు, ఆస్తి వివాదాలకు సంబంధించిన ఫిర్యాదులే అధికంగా ఉన్నాయి.

సీస్‌కు సర్వం సిద్ధం

- జిల్లాలో 976 పాఠశాలల్లో నిర్వహణకు ఏర్పాట్లు
- ప్రాక్టీస్ టెస్ట్‌ల్లో నిమగ్నమైన ఉపాధ్యాయులు
- 3,6,9 తరగతుల విద్యార్థులకు నవంబర్ 3న సామర్థ్య మదింపు పరీక్ష

రాయవరం: పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను అంచనా వేసేందుకు ప్రతి మూడేళ్లకు ఎన్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో సర్వే నిర్వహిస్తుంటారు. అందులో భాగంగా 2024 ఫిబ్రవరిలో నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే నిర్వహించనున్నారు. దానికి ముందుగా రాష్ట్ర విద్యా పరిశోధన మండలి ఆధ్వర్యంలో నవంబర్ 3న సీస్ (స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే) నిర్వహణకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 3,6,9 తరగతుల విద్యార్థులకు నిర్వహించే ఈ సర్వేకు సంబంధించి ఇప్పటికే జిల్లా కేంద్రానికి పరీక్ష పేపర్లు చేరుకున్నాయి. నవంబర్ 2వ తేదీ వరకు ఎంపిక చేసిన పాఠశాలల్లోని విద్యార్థులతో ప్రాక్టీస్ టెస్ట్‌ల నిర్వహణలో ఉపాధ్యాయులు నిమగ్నమయ్యారు.

1,075 మంది ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ల నియామకం

'సీస్' సర్వే నిర్వహించేందుకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రాష్ట్ర విద్యా పరిశోధన మండలి ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలోని 976 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను ఎంపిక చేసింది. విద్యార్థుల్లో అభ్యసన ఫలితాలు (లెర్నింగ్ అవుట్ కమ్స్) ఏ విధంగా ఉన్నాయో తెలుసుకునేందుకు నిర్వహించే సర్వేకు ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ల (ఎఫ్ఐ) నియామకం చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ, ఇంజినీరింగ్, డైట్ కళాశాలల విద్యార్థులు 1,075 మందిని జిల్లా విద్యాశాఖ ఎఫ్ఐలుగా నియమించింది. వీరికి డివిజన్ స్థాయిలో శిక్షణ ఇచ్చారు. జిల్లా విద్యాశాఖాధికారి పర్యవేక్షణలో డీసీఈబీ సెక్రటరీ, సమగ్ర శిక్షా ఏఎంవో, డైట్ ప్రిన్సిపాల్/లెక్చరర్, డీఈవో కార్యాలయ ప్రతినిధి, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ ఈ పరీక్షల నిర్వహణకు సంబంధించిన ప్రక్రియను పరిశీలిస్తున్నారు. మండల స్థాయిలో ఎంఈవో-1, ఎంఈవో-2లతో పాటుగా, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు సర్వే నిర్వహణను పర్యవేక్షిస్తారు.

ప్రాక్టీస్ పేపర్లలో నిమగ్నం : 'సీస్' సర్వేలో భాగంగా మూడు, ఆరు, తొమ్మిది తరగతుల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్ష ఓఎంఆర్ విధానంలో ఉంటుంది. మూడు, ఆరు తరగతుల విద్యార్థులకు ప్రధానంగా ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీపై పరీక్ష ఉంటుంది. 9వ తరగతికి తెలుగు/ఇంగ్లిష్, గణితం, సోషల్, సైన్స్ సబ్జెక్టులపై పరీక్ష నిర్వహిస్తారు. తరగతి ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుడు కూడా ప్రశ్నావళికి ఓఎంఆర్ పద్ధతిలో జవాబులు నింపాల్సి ఉంటుంది. ప్రతి తరగతికి పరీక్ష నిర్వహణకు ఒక్కో ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్‌ను నియమించారు.

ముఖ్యాంశాలివీ..

మూడవ తరగతి విద్యార్థులకు మూడవ తరగతి సిలబస్‌పై పరీక్షను నిర్వహిస్తారు. ఆరు, తొమ్మిదవ తరగతి విద్యార్థులకు గతేడాది సిలబస్‌పై పరీక్షను నిర్వహిస్తారు. జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో ఉదయం 10.30 గంటలకు పరీక్షను ప్రారంభిస్తారు. మూడవ తరగతి విద్యార్థులకు 60 నిమిషాలు, ఆరవ తరగతి విద్యార్థులకు 75 నిమిషాలు, తొమ్మిదవ తరగతి విద్యార్థులకు 90 నిమిషాల సమయాన్ని పరీక్ష రాయడానికి కేటాయిస్తారు.



మాదిరి ప్రశ్న పత్రాలను విద్యార్థులతో ప్రాక్టీస్ చేయిస్తున్న ఉపాధ్యాయుడు

బలాలు, బలహీనతలు తెలుసుకునే వీలు



విద్యా వ్యవస్థలోని బలాలు, బలహీనతలు అంచనా వేసుకోవడానికి, గుణాత్మక బోధనను అందించేందుకు ప్రణాళికలు రచించేందుకు సర్వే ఉపకరిస్తుంది. మండల స్థాయిలో ఎంఈవోలు పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

– బొజ్జా రమణశ్రీ, ఎంఈవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

ఏర్పాట్లు పూర్తి



పరీక్షలకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. బ్లాక్ లెవల్ అధికారులు ఎఫ్ఐలతో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లకు అందజేస్తున్నాం.

– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం

బాలికపై అత్యాచార యత్నం

ముమ్మిడివరం: 13 ఏళ్ల బాలికపై ఆమె మేనమామ అత్యాచార యత్నానికి పాల్పడ్డాడన్న కేసులో నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు ఎస్సై ఎస్.శివప్రసాద్ తెలిపారు. నగర పంచాయతీ వంగలపూడి వారిపేటకు చెందిన ఎనిమిదో తరగతి చదువుతున్న బాలికను ఆమె మేనమామ వంగలపూడి శ్రీనివాసరావు కొంతకాలంగా ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని వెంట పడి వేధిస్తున్నాడు. ఈ నెల 17న బాలిక ఇంట్లో ఎవరూ లేని సమయంలో శ్రీనివాసరావు అత్యాచారానికి ప్రయత్నించడంతో అతనిని నుంచి తప్పించుకుని బంధువుల ఇంటికి వెళ్లింది. బాలిక తల్లితండ్రులు లేక పోవడంతో అమ్మమ్మ ఇంట్లో ఉంటోంది. బంధువుల సహకారంతో బాలిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి నిందితుడిని సోమవారం అరెస్టు కోర్టులో హాజరు పర్చినట్లు ఎస్సై శివప్రసాద్ తెలిపారు.

కారు అద్దెకు తీసుకుని.. తాకట్టు పెట్టి పరారు

అమలాపురం టౌన్: ఓ కారును అద్దెకు తీసుకుని ఆపై దానిని తాకట్టు పెట్టి, కారు యాజమానికి సమాధానం చెప్పకుండా పరారీలో ఉన్న సఖినేటిపల్లి మండలం అంతర్వేదిపాలేనికి చెందిన బీర కృష్ణమూర్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ టి.క్రాంతికుమార్ తెలిపారు. పట్టణానికి చెందిన మహ్మద్ అబ్బాస్ హైదర్ ఓ ఫొటో స్టూడియో నిర్వహిస్తూనే తన వద్ద ఉన్న సుజుకీ బెలేనో కారును అద్దెకు తిప్పుకుంటున్నారు. ఆరు నెలల కిందట బీర కృష్ణమూర్తికి కారును అద్దెకు ఇచ్చారు. తర్వాత అతడు ఆ కారును వేరే చోట తాకట్టు పెట్టి సొమ్ము చేసుకున్నాడు. కారు యాజమాని ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు పరారీలో ఉన్నాడని తెలిపారు.

భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్య

మృతురాలు ఆలమూరు ప్రభుత్వ పాఠశాలలో టీచర్



నాగవెంకటలక్ష్మి మృతదేహం

ఆత్రేయపురం: మండల పరిధిలోని ర్యాలి గ్రామంలో ఒక వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఆమె ఆలమూరు ప్రభుత్వ పాఠశాలలో టీచర్‌గా పని చేస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన సుంకర నాగ వెంకటలక్ష్మి (36) ఇంట్లో ఆదివారం అర్ధరాత్రి సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ మేరకు ఆమె సోదరుడు సుంకర కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన అక్క ఆలమూరు ప్రభుత్వ బాలికల పాఠశాలలో టీచర్‌గా పని చేస్తోందని, భర్త రమేష్ వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతురాలి భర్త ఫార్మా కంపెనీలో ఏరియా మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. వీరికి నాలుగేళ్ల కొడుకు ఉన్నాడు. ఘటనా స్థలాన్ని ఎస్సై బీవై కిరణ్‌కుమార్ పరిశీలించి గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి స్థలం విరాళం

కపిలేశ్వరపురం: గ్రామానికి చెందిన మేకా బుల్లి అబ్బు, సూరమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు సూర్యచంద్ర పట్టాభిరామారావు, రాజ్యలక్ష్మి దంపతులు స్థానిక ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి రూ.20 లక్షల విలువ చేసే ఐదు సెంట్ల స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. ఆ స్థలాన్ని ఆసుపత్రి సందర్శకుల వాహన పార్కింగ్‌గా మెరుగుపర్చారు. పార్కింగ్ ప్రదేశాన్ని సోమవారం దాత కుటుంబీకులు మేకా సుబ్బారావు, మాజీ సర్పంచ్ ఎంఎస్‌వీ ప్రసాద్ ప్రారంభించారు. వారిని గ్రామ సర్పంచ్ శాకా శ్రీనివాస్, ఆసుపత్రి నిర్వాహకులు అభినందించారు.

ఇద్దరి దొంగల అరెస్ట్

31 గ్రాముల బంగారం, రూ.84 వేల నగదు, బైక్ స్వాధీనం

అమలాపురం టౌన్: మోటారు సైకిల్‌పై వెళుతున్న అన్నాచెల్లెళ్లను వెంబడించి వారి వద్ద బంగారం, నగదుతో ఉన్న బ్యాగ్‌ను దోచుకున్న ఇద్దరిని సోమవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచినట్లు అమలాపురం డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్ తెలిపారు. అమలాపురం ఎర్ర వంతెన సమీపంలో ఈ నెల 23వ తేదీ మధ్యాహ్నం అన్నా చెల్లెళ్ల నుంచి బ్యాగ్‌ను లాక్కుని ఆ ఇద్దరూ పరారైనట్లు చెప్పారు. అదే రోజు ఈ దోపిడీకి ముందు వారు ఐ.పోలవరం మండలం మురమళ్ల సమీపంలో ఓ మోటారు సైకిల్ దొంగిలించారు. అదే మోటారు సైకిల్‌పై వచ్చి ఈ దోపిడీకి పాల్పడ్డారని తెలిపారు. ఐ.పోలవరం మండలం బాణాపురానికి చెందిన అన్నా చెల్లెళ్లు మోటారు సైకిల్‌పై బంగారు నగలు కొనుగోలుకు అమలాపురం వచ్చారు. ఓ దుకాణంలో బంగారు గొలుసు కొనుగోలు చేసి వారి వద్ద ఉన్న పాత బంగారు గొలుసు మరమ్మతు చేయించుకున్నారు. బంగారు నగలతోపాటు రూ.1.50 లక్షలతో ఉన్న బ్యాగ్‌తో వారు మోటారు సైకిల్‌పై ఇంటికి బయలుదేరారు. వారిని అప్పటికే దొంగిలించిన మోటారు సైకిల్‌పై ఆ ఇద్దరి యువకులు వెంబడించారు. అమలాపురం ఎర్రవంతెన సమీపానికి వెళ్లేసరికి ఆ బ్యాగ్‌ను లాక్కుని పరారయ్యారు. అమలాపురం తాలూకా పోలీసులు రంగంలోకి దిగి నిందితుల కోసం గాలించారు. ఆ ఇద్దరి యువకులను గుర్తించి అరెస్ట్ చేశారు. కాకినాడ డెయిరీ ఫారం సెంటర్‌కు చెందిన పాలూరి రాజేష్ (19), కరప మండలం నడకుదురుకు చెందిన కల్యాణపు ఫణీంద్ర సాయి (21)ని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు డీఎస్పీ తెలిపారు. వారి వద్ద నుంచి 31 గ్రాముల రెండు బంగారు గొలుసులు, కాజేసిన రూ.1.50 లక్షల నగదులో రూ.84 వేలు, దొంగిలించిన మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. అమలాపురం తాలూకా, ఐ.పోలవరం పోలీసు స్టేషన్లలో వారిపై కేసులు నమోదు అయ్యాయి. అమలాపురం రూరల్ సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో ఎస్సై ఎ.పరదేశి ఈ కేసును లోతుగా దర్యాప్తు చేశారు. వీరితో పాటు క్రైమ్ సీఐ బి.తిరుపతిరావు, కాకినాడ సీసీఎస్ బృందం సమిష్టి దర్యాప్తు చేసి నిందితులను గుర్తించారు. వీరిని జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ అభినందించారు.

ఊరు వెళ్లి వచ్చేసరికి ఇల్లు గుల్ల

13 కాసుల బంగారం, పావు కేజీ వెండి, 33 వేల నగదు చోరీ



చోరులు ధ్వంసం చేసిన బీరువా తలుపులు

రాజోలు: ఊరు వెళ్లి వచ్చే సరికి దొంగలు ఇల్లు గుల్ల చేశారు. కూనవరం గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంటి తలుపులు పగులగొట్టి దొంగలు 13 కాసుల బంగారం, పావు కేజీ వెండి, 33 వేల నగదు చోరీ చేశారు. రాజోలు ఎస్సై పృథ్వీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కూనవరం గ్రామానికి చెందిన ఉల్లూరి బాలకృష్ణ తన కుటుంబంతో కలసి అత్తవారి ఇంటికి తాటిపాక ఈ నెల 27వ తేదీన వెళ్లారు. తిరిగి మళ్లీ ఈ నెల 29న తిరిగి వచ్చే సరికి ఇంటి తలుపులు పగులకొట్టి గదిలో ఉన్న బీరువా తలుపులు తెరచి ఉన్నాయి. బీరువాలో దాచి ఉంచిన నగదు, బంగారం, వెండి వస్తువులు చోరీకి గురైనట్టు గుర్తించారు. బాలకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.